
సాక్షి ఒడిశా

శుక్రవారం । 20 । అక్టోబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,07,788లు, బంగారం 16 గ్రాము 250 మిల్లీగ్రాములు, వెండి 63 గ్రాముల 950 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఉత్సవాలకు పటిష్ట భద్రత

దసరా పూజలు సందర్భంగా భువనేశ్వర్ కమిషనరేట్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

- IIలో



అంబులెన్స్‌ను ఢీకొని బస్సు బోల్తా

భద్రక్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం అంబులెన్స్‌ను ఢీకొని ప్రైవేటు ప్రయాణికుల బస్సు బోల్తా పడింది.

- IIలో

నూతన గవర్నర్‌గా రఘుబర్ దాస్

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి కార్యాలయం
- ఈయన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి
- ప్రస్తుతం బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రఘుబర్ దాస్

భువనేశ్వర్: ఒడిశా తదుపరి గవర్నర్‌గా రఘుబర్ దాస్ నియమితులయ్యారు. ఆయన జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రొఫెసర్ గణేషీ లాల్ స్థానంలో రఘుబర్ దాస్ బాధ్యతలు చేపట్టనున్నారు. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి నియామకం ఉత్తర్వులు అమలులోకి వస్తాయని రాష్ట్రపతి కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రస్థానం

రఘుబర్ దాస్ 2014 నుంచి 2019 సంవత్సరం వరకు జార్ఖండ్ ముఖ్యమంత్రిగా కొనసాగారు. జార్ఖండ్ శాసనసభకు ఐదుసార్లు ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన స్వయం కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించిన నాయకుడు. జార్ఖండ్‌లో తొలి గిరిజనేతర ముఖ్యమంత్రి. శాసనసభకు ఏకంగా 5 సార్లు ఎన్నికయ్యారు.

నిరుపేద కుటుంబంలో జననం

ఆయన 1955వ సంవత్సరం మే 3వ తేదీన భాలుబాసా ప్రాంతంలోని నిరుపేద కుటుంబంలో జన్మించారు. అతని తండ్రి జంషెడ్‌పూర్‌లో కూలీగా పని చేసేవాడు. రఘుబర దాస్ ఒకప్పుడు టాటా స్టీల్‌కు చెందిన రోలింగ్ మిల్లులో మజ్దూర్ (కూలీ)గా పని చేసేవాడు. జంషెడ్‌పూర్‌లోని భాలుబాసా హరిజన్ హైస్కూల్ నుంచి పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత జంషెడ్‌పూర్ కో–ఆపరేటివ్ కాలేజీలో సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తన విద్యార్థి రోజుల్లోనే చురుకైన యూనియన్ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. జంషెడ్‌పూర్ కో–ఆపరేటివ్ కాలేజీలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత న్యాయ శాస్త్రంలో ఉత్తీర్ణత సాధించారు. 1976–77 కాలంలో లోక్ నాయక్ జై ప్రకాష్ నారాయణ్ ప్రారంభించిన విద్యార్థి ఉద్యమ కార్యకర్తగా రాజకీయ జీవితాన్ని శ్రీకారం చుట్టారు. ఎమర్జెన్సీ సమయంలో జైలు శిక్ష కూడా అనుభవించారు. 1977 సంవత్సరంలో జనతా పార్టీలో చేరిన రఘుబర దాస్ మూడేళ్ల తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరారు. 1995 అసెంబ్లీ ఎన్నికల్లో జంషెడ్‌పూర్ (తూర్పు) నుంచి పార్టీ అభ్యర్థిగా నామినేట్ కావడానికి ముందు, భారతీయ జనతా పార్టీలో పలు కీలకమైన సంస్థాగత హోదాల్లో బాధ్యతలను విజయవంతంగా నిర్వహించారు. ఓబీసీ కమ్యూనిటీకి చెందిన రఘుబర దాస్ 1995 నుంచి 2019 వరకు 5 సార్లు జంషెడ్‌పూర్ (తూర్పు) స్థానం గెలుచుకున్నారు. బీజేపీ శాసన సభా పక్ష నాయకుడిగా ఎన్నికైన తర్వాత ఒక కార్మికుడు (మజ్దూర్) సీఎం, పీఎం లేదా రాష్ట్రపతి కావడం అనేది ఒక్క భారతీయ జనతా పార్టీలో మాత్రమే సాధ్యమని ప్రకటించడం విశేషం.

జార్ఖండ్ ఆవిర్భావం నుంచి..

జార్ఖండ్ కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించడంతో 2004 సంవత్సరంలో బీజేపీ జార్ఖండ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. బాబూ లాల్ మరాండీ ప్రభుత్వంలో తొలిసారిగా కొత్త రాష్ట్రానికి మంత్రి అయ్యారు. అర్జున్ ముండా నేతృత్వంలో ఏర్పాటైన మంత్రి మండలిలో కూడా రఘుబర దాస్‌కు పదవి లభించడం విశేషం. 2009 సంవత్సరం శిబు సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. దీర్ఘకాల రాజకీయ జీవనంలో ఆర్థిక, కార్మిక మరియు పట్టణాభివృద్ధి శాఖల కేబినెట్ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుత ఒడిశా గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ స్థానంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రొఫెసర్ లాల్ 2018 సంవత్సరం మే 25న గవర్నర్‌గా నియమితులయ్యారు. నాలుగు రోజుల తర్వాత మే 29న ఆయన రాష్ట్ర గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌గా ఆయన పదవీ కాలం ఈ ఏడాది మే నెలలో అధికారికంగా ముగిసింది. తదుపరి గవర్నర్ నియామకం జాప్యం కావడంతో ఇంతవరకు గవర్నర్ హోదాలో కొనసాగారు.

ముఖ్యమంత్రి శుభాకాంక్షలు

ఒడిశా గవర్నర్‌గా నియమితులైన రఘుబర్ దాస్‌ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గురువారం అభినందించారు. రాష్ట్ర అభివృద్ధి మరియు ప్రజల సంక్షేమం కోసం అతనితో కలిసి పనిచేయడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

నేడు 36 లక్ష్మీ బస్సులు ప్రారంభం



స్టేడియంలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న లక్ష్మీ బస్సులు

పర్లాకిమిడి: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల్లో లక్ష్మీ బస్సు పథకాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా స్థానిక గజపతి స్టేడియంలో 36 బస్సులను సీఎం నవీన్ పట్నాయక్ వర్చువల్‌గా శుక్రవారం ప్రారంభించనున్నారు. జిల్లాలోని గుమ్మా, కాశీనగర్, నువాగడ, రాయఘడ, ఆర్.ఉదయగిరి, రామగిరి, మోహనాలోని మారుమూల గ్రామాలకు బస్సులు నడపనున్నారు. ఈ బస్సులు అంగన్‌వాడీ కార్యకర్తలు, మిషన్ శక్తి మహిళలు, స్కూల్ విద్యార్థులు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. ఈ మేరకు ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు.

హైకోర్టు వర్చువల్ బెంచి ఏర్పాటు



హైకోర్టు వర్చువల్ బెంచి ప్రారంభిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో హైకోర్టు వర్చువల్ బెంచి కోర్టును (కటక్) హైకోర్ట్ చీఫ్ జస్టిస్ బి.ఆర్.సారంగి గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.పృథ్వీరాజ్ మాట్లాడుతూ జిల్లా వాసులకు ఈ హైకోర్టు వర్చువల్ కోర్టు ద్వారా ఏదైనా కేసులో వర్చువల్‌గా హాజరయ్యి, పర్లాకిమిడి జిల్లా కోర్టులోనే కేసు ఫైల్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గజపతి జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్, జిల్లా న్యాయ సేవా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానమే ప్రగతికి సోపానం



విజ్ఞాన మేళాలో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రశాంత కుమార్ గుప్త

జయపురం: విజ్ఞానమే ప్రగతికి సోపానమని బొయిపరిగుడ సమితి చైర్మన్ ప్రశాంత కుమార్ గుప్త అన్నారు. బొయిపరిగుడ ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన విజ్ఞాన మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. మొత్తం 64 మంది విద్యార్థులు ఈ మేళాలో పాల్గొని, 5 అంశాలపై నిర్వహించిన తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందజేస్తామని మేళా నిర్వాహక అధ్యక్షురాలు కల్యాణి బాగ్ తెలియజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత పట్నాయక్, అధ్యాపకురాలు మానసీ పండ, సమితి సాధనా కేంద్ర కో–ఆర్డినేటర్ భక్త మెహర్ తదితరులు పాల్గొన్నారు.

బలియాలో ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

జయపురం: సమితి పరిధిలోని బలియా గ్రామంలో జయపురం రోటరీ క్లబ్ ఆఫ్ ఫ్లడ్ సభ్యులు ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. డాక్టర్ ఎస్‌కే మహ్మద్ హుస్సేన్ 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు అశోక్ మిశ్ర, కార్యదర్శి సురేష్ పాణిగ్రహిలు మాట్లాడుతూ సమాజ సేవే ప్రధాన లక్ష్యంగా రోటరీ క్లబ్ పనిచేస్తోందని తెలియజేశారు. కొరాపుట్ జిల్లాలోని ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు జి.వెంకటరావు, నరేష్ మహ్మద్, రబీ నారాయణ నందో, రత్నాకర చౌదరి, పూర్ణచంద్ర పట్నాయక్, కె.బ్రహ్మ, సంజీవ్ మిశ్ర, ప్రదీప్ సాహు, మురళీ ధర సాబత్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్



మాట్లాడుతున్న మహంతి తదితరులు

జయపురం: బకాయి పడిన నాలుగు నెలల వేతనాన్ని చెల్లించడంతో పాటు 2012–2015లలో జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని జయపురం గగనాపూర్ సేవా పేపర్ మిల్లు శ్రామిక యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. పారాబెడలోని రుత్‌రాజ్ మండపంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ కార్మికుల రెండు డిమాండ్లు అమలు చేసేంతవరకు పేపరు మిల్లులో ఉత్పత్తికి సహకరించమని స్పష్టం చేశారు. మిల్లు పరిచాలన యాజమాన్యం ప్రతిసారీ హామీలు ఇస్తూ, వాటిని తుంగలో తొక్కుతోందని ధ్వజమెత్తారు. మిల్లు శ్రామికుల సమస్యలపై పలు సమావేశాలు జరిపామని, అయితే అన్ని సమయాల్లోనూ యాజమాన్యం హామీలు ఇస్తూ విస్మరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత 12వ తేదీన యాజమాన్యం చేసిన విజ్ఞప్తిని మిల్లు శ్రామికులు వ్యతిరేకించారని వెల్లడించారు. మాజీ మంత్రి రబినారాయణ నందో కలుగజేసుకొని ఆ విజ్ఞప్తిని రద్దు చేయించారని మహంతి వెల్లడించారు. అయితే ఆ విజ్ఞప్తి ప్రతిని మిల్లు యాజమాన్యం లేబర్ అధికారులకు అందజేసిందని తెలియజేశారు. ఒక పక్క విజ్ఞప్తిని రద్దు చేసినట్లు చెప్పిన యామాన్యం, మరోపక్క ప్రభుత్వ అధికారులకు అందజేస్తూ రెండు నాలుకల ధోరణిలో వెళ్తోందని మండిపడ్డారు. మిల్లు నడిచేందుకు శ్రామికులు ఎంతో సహకరిస్తున్నా, యాజమాన్యం వారి సమస్యలు పరిష్కరించటంలో చిత్తశుద్ధి చూపడం లేదని విమర్శించారు. సమావేశంలో మిల్లు శ్రామిక నేతలు సరోజ్ సువార్, భంశీధర మహంకుడా, ప్రదీప్ పంజియ, కేదార్ ఆచార్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం



రామచంద్ర చౌహాన్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన ట్రక్కు

జయపురం: సైకిల్‌పై వెళ్తున్న వృద్ధుడిని ట్రక్కు ఢీకొనడంతో దుర్మరణం చెందిన ఘటన జయపురంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... సదర్ పోలీసుస్టేషన్ పరిధి రత్నాకరగుడకు చెందిన రామచంద్ర చౌహాన్(70) గురువారం మధ్యాహ్నం సైకిల్‌పై వెళ్తుండగా జయపురం క్రిస్టియన్‌పేట సమీపంలోని పెట్రోలు బంక్ కూడలి వద్ద ఒక ట్రక్కు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రామచంద్రను స్థానిక జిల్లా కేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మరణించినట్లు డాక్టర్లు ప్రకటించారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ బిష్ణు బెహర తెలియజేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ఘటన స్థలంలో మృతదేహం ఆనవాళ్లు



దర్యాప్తు చేస్తున్న పోలీసులు



చెట్టుకు వేలాడుతున్న తలభాగం

కొరాపుట్: జిల్లాలోని సుబయ్ అడవుల్లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గురువారం నందపూర్ పోలీసుస్టేషన్ పరిధి సుబయ్ అటవీ ప్రాంతంలో జంకర్ కొడా కొండ మీద మృతదేహం లభించినట్లు పోలీసులు ధ్రువీకరించారు. కొద్ది రోజులుగా అటవీ ప్రాంతంలో తిరుగుతున్న గిరిజనులకు దుర్వాసన వస్తోంది. అది రోజురోజుకీ పెరుగుతుండడంతో అనుమానంతో అడవి లోపలికి వెళ్లారు. అక్కడ చెట్టుకి తలభాగం వేలాడుతూ, మిగతా శరీరం కిందపడి గుర్తు పట్టలేనివిధంగా ఉన్నటువంటి పురుషుడి మృతదేహం కనిపించింది. దీంతో భయాందోళనకు గురై తక్షణమే పోలీసులకు సమాచారం ఇచ్చారు. నందపూర్ ఎస్డీపీవో సంజయ్ కుమార్ మహాపాత్రో నేతృత్వంలో పోలీసులు అతికష్టం మీద కాలి నడకన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహం స్వాధీనం చేసుకొని పంచనామా నిర్వహించారు. క్లూస్ టీమ్ సాయంతో ఘటన స్థలంలో దర్యాప్తు చేపట్టారు.

సంతోష్‌పూర్‌లో పులి సంచారం..?



ఆవు కళేబరం



పులి అడుగు జాడలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ బ్లాక్ సంతోష్‌పూర్ గ్రామంలో పులి సంచరిస్తున్నట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. గ్రామంలోని పింటూ నాయక్ అనే రైతు గ్రామ శివారులోని కొండమీద ఆవు కళేబరం కనిపించినట్లు తెలియజేశాడు. ఆవు కళేబరం పక్కనే పులి అడుగు జాడలు కనిపించడంతో అటవీ అధికారులకు సమాచారం అందజేశారు. నారాయణపూర్ అటవీ రేంజ్ అధికారులు సంతోష్‌పూర్ గ్రామానికి వెళ్లి పులి అడుగులను పరిశీలించారు. సంఘటన స్థలంలో కనిపించిన పాద ముద్రలను భువనేశ్వర్‌లోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించనున్నామని, అయితే అవి పులి అడుగు జాడలని నిర్ధారించుకోలేదని ఏసీఎఫ్‌వో అశోక్ కుమార్ బెహరా తెలియజేశారు. రాత్రి సమయంలో గ్రామస్తులు బయట తిరగరాదని, వారి ఆవులు, మేకలు, కోళ్లను కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. రెండు డ్రోన్ల సాయంతో ఆ జంతువు ఆచూకీ కోసం గాలిస్తున్నామని అటవీ అధికారులు తెలియజేశారు. ఉదయం ఇంటి వద్ద కనబడిన ఆవు, సాయంత్రం ఆరు గంటల తర్వాత కళేబరమై కొండమీద కనబడిందని పేర్కొన్నాడు.

ప్యాసింజర్ రైలు పునః ప్రారంభం నేడు



ఉత్తర్వులు విడుదల చేసిన రైల్వేశాఖ

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వే మార్గంలో కొరాపుట్–కిరండోల్ మధ్య తొలి ప్యాసింజర్ రైలు నేటి నుంచి పునః ప్రారంభం కానున్నది. గురువారం అందుకు తగ్గ ఆదేశాలు రైల్వే శాఖ విడుదల చేసింది. సెప్టెంబర్ 24వ తేదీన కొరాపుట్ సమీపంలో జంత్రి–మనబార్ రైల్వేస్టేషన్ల మధ్య మట్టి కొండలు ముందుకు చొచ్చుకొచ్చాయి. నాటి నుంచి ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో అనేక ప్రయాసలు పడి రైల్వేమార్గం పునరుద్ధరించారు. శుక్రవారం నుంచి 18005, 18006 నంబర్ల గల హౌరా–జగదల్‌పూర్, జగదల్‌పూర్–హౌరా రైళ్లని పునః ప్రారంభిస్తున్నారు. ఇంకా ఈ మార్గం గుండా వెళ్లాల్సిన రాయపూర్, విశాఖపట్నం, భుబనేశ్వర్, రౌర్కెలా రైళ్లను పునరుద్ధరించాల్సి ఉంది.

20 బస్తాల గంజాయి సీజ్



దాడులు చేపట్టిన పోలీసుల బృందం

- ఇద్దరు నిందితులు అరెస్టు

బరంపురం: గంజాం జిల్లాలో గంజాయి మాఫియా రోజురోజుకీ విస్తరిస్తోంది. అస్కా పట్టణం మీదుగా బరంపురం నగరానికి అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని అస్కా పోలీసు అధికారులు పట్టుకున్నారు. ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ సాహు తెలిపిన వివరాల మేరకు.. గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా ఇచ్చిన సమాచారంతో మంగళవారం అర్ధరాత్రి అస్కా పోలీసుస్టేషన్ పరిధి చరిచొక్కా జంక్షన్ నుంచి బరంపురం నగరం మీదుగా రవాణా అవుతున్న 20 గంజాయి బస్తాలను సీజ్ చేసి, ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో రాజస్తాన్ ఉదయపూర్‌కి చెందిన డ్రైవర్ మోంగిలాల్ దలాల్ మరియు కరియాగుడాకి చెందిన సదానంద్ మాలిక్‌లు ఉన్నట్లుగా పోలీసులు తెలియజేశారు. నిందితులను అస్కా సబ్ డివిజన్ కోర్టులో బుధవారం ప్రవేశపెట్టారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

జూదం అడ్డాలపై పోలీసుల దాడులు

- 55 మంది పేకాటరాయుళ్లు అరెస్టు



గోపాల్‌పూర్‌లో అరెస్టైన పేకాటరాయుళ్లు

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జూదం అడ్డాలను నియంత్రించేందుకు ఎస్పీ సర్వాణ్ వివేక్ ఒక ప్రత్యేక పోలీసు అధికార బృందాన్ని నియమించారు. ఈ నేపథ్యంలో బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో నిర్వహించిస్తున్న జూదం అడ్డాలపై దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా 55 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు రూ.1,91,767 నగదు, 40 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం రాత్రి గోపాల్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధి బొడొకుస్తిలి గ్రామంలో రహస్యంగా జూదమాడుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ప్రత్యేక పోలీసు బృందం అధికారులు దాడులు చేసి 9 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.39,800 నగదు, 9 సెల్‌ఫోన్లు, 3 పేకముక్కల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా హింజిలికాట్ పోలీసుస్టేషన్ పరిధి అంకురడా గ్రామంలో నడుస్తున్న జూదం అడ్డాలపై దాడిచేసి 6 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, రూ.17,190 నగదు మరియు 7 సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. పెద్ద బజార్ పోలీసుస్టేషన్, టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రెండుచోట్ల దాడులు నిర్వహించి 13 మందిని అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి రూ.17,200 నగదు, 9 సెల్‌ఫోన్లు, పుల్లసుందరి వీధిలో దాడిచేసి 10 మందిని అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి రూ.27,100 నగదు, 9 సెల్‌ఫోన్లు, టౌన్ పోలీసుస్టేషన్ పరిధి పార్కు వీధిలో మరో 8 మందిని అరెస్టు చేసి రూ.48,850 నగదు, 7 సెల్‌ఫోన్లు, సదర్ పోలీసుస్టేషన్ పరిధి అంకుసుపూర్ గ్రామంలో మరో 9 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.19,200 నగదు, 5 సెల్‌ఫోన్లు, 3 పేకకట్టలు స్వాధీనం చేసుకున్నారు.



పెద్ద బజార్ పోలీసులు అరెస్టు చేసిన వ్యక్తులు



పులిసుందరి వీధిలో అరెస్టైన జూదగాళ్లు



హింజిలికాట్‌లో అరెస్టైన వ్యక్తులు

క్లుప్తంగా

పేదలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్ దంపతులు

రాయగడ: దసరా ఉత్సవాలను పురస్కరించుకొని బీజేడీ జిల్లా కార్యదర్శి, శ్రీనివాస్ ఆగ్రో సంస్థ అధినేత దూడల శ్రీనివాస్ గురువారం పేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తోటగుడలోని అతని ఫార్మ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తోటగుడ, దొందులి, జేకేపూర్ తదితర ప్రాంతాలకు చెందిన 80 మంది ఆదివాసీలకు దుస్తులను అందజేశారు. ప్రతీ ఏడాది ఇటువంటి తరహా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మ్యూజియం ఏర్పాటుకు ఆమోదం



క్యాబినెట్ నిర్ణయాలు వెల్లడిస్తున్న ప్రదీప్ కుమార్ జెనా

భువనేశ్వర్: ఒడిశాలో ప్రత్యేక డైరెక్టరేట్ ఆఫ్ మ్యూజియం మరియు ప్రత్యేక డైరెక్టరేట్ ఆఫ్ ఆర్కియాలజీ ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి మండలి గురువారం ఆమోదం తెలిపింది. ద్వితీయ హెరిటేజ్ క్యాబినెట్ నిర్ణయానికి అనుగుణంగా రాష్ట్రంలో 2 ప్రత్యేక డైరెక్టరేట్ల ఏర్పాటుకు అనుబంధ ప్రతిపాదనలు ఈ సమావేశంలో ఆమోదం పొందడం విశేషం. అనేక ఇతర రాష్ట్రాల్లో మ్యూజియం నిర్వహణకు ప్రత్యేక డైరెక్టరేట్ ఉంది. అదేవిధంగా సాంస్కృతిక మరియు కళాత్మక కళాఖండాల వారసత్వ విలువలు, పరిరక్షణ మరియు ప్రచారం కోసం రాష్ట్రంలో మ్యూజియం కోసం ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు అవసరమని మంత్రి మండలి అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కొత్త క్యూరేటోరియల్ కేడర్‌ను ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ఆమోదం మేరకు అసిస్టెంట్ క్యూరేటర్, క్యూరేటర్, అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ మరియు జాయింట్ డైరెక్టర్ కమ్ సూపరింటెండెంట్, ఒడిశా స్టేట్ మ్యూజియం డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ మ్యూజియం కోసం అవసరమైన మినిస్టీరియల్ మరియు టెక్నికల్ పోస్టులతో ఇంజినీరింగ్ శాఖ ఏర్పాటుకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఒడిశాలో కనుగొనబడిన పురాతన దేవాలయాలు మరియు సాంస్కృతిక వారసత్వంతో కూడిన స్మారక చిహ్నాలు రాష్ట్రానికి కీర్తిని తెస్తున్నాయి. అనేక ఇతర రాష్ట్రాల్లో, ఆర్కియాలజీకి ప్రత్యేక డైరెక్టరేట్ పనిచేస్తోంది. కాబట్టి అటువంటి పురావస్తు మూలకాలను సేకరణ మరియు సంరక్షణకు రాష్ట్రంలో ఒక ప్రత్యేక డైరెక్టరేట్ ఆఫ్ ఆర్కియాలజీ ఏర్పాటు చాలా అవసరం. ఈ నేపథ్యంలో ఆర్కియాలజీకి ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుకు కూడా మంత్రివర్గం నిర్ణయించిందని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి ప్రదీప్ కుమార్ జెనా తెలిపారు. ఈ డైరెక్టరేట్ నిర్వహణ కోసం అసిస్టెంట్ క్యూరేటర్, క్యూరేటర్/అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్ కమ్ సూపరింటెండెంట్, స్టేట్ ఆర్కియాలజీ మరియు డైరెక్టర్ వంటి ప్రత్యేక పురావస్తు క్యూరేటర్ కేడర్‌తో పాటు డైరెక్టరేట్‌కు అవసరమైన ఆర్కియాలజికల్ ఇంజనీరింగ్ వింగ్, మినిస్టీరియల్ మరియు టెక్నికల్ పోస్టుల సృష్టికి కూడా క్యాబినేట్ ఆమోదం తెలిపింది. తొలి హెరిటేజ్ క్యాబినేట్ ప్రతిపాదన మేరకు ప్రత్యేక డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.

రాయగడలో శిశు మహోత్సవాలు

రాయగడ: విద్యార్థుల్లో ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తేసేందుకు విద్యాశాఖ ప్రతీ ఏడాది శిశు మహోత్సవాలను నిర్వహిస్తోందని బీడీవో అమూల్య కుమార్ సాహు అన్నారు. స్థానిక ఎల్కక్ట్రికల్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శిశు మహోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏబీఈవో ఛబీలాల్ సింగ్, బీఈవో సుదీప్త కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



చవులియా గంజ్ జయదుర్గా మాత సరస్వతీ అలంకరణ



శోడషి అలంకరణలో గొడాగొడియా దక్షిణ కాళీమాత



గాయత్రీ స్వరూపంలో దర్శనమిచ్చిన ఝంజిరి మంగళామాత



గొడొ చండీమాత గాయత్రీ స్వరూపం



గాయత్రీ స్వరూపంలో చార నారాయణి అమ్మవారు

కరుణించు దుర్గమ్మా..!

రాష్ట్రవ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవి మండపాలు, ఆలయాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, శక్తి పీఠాలు, పూజా మండపాల్లో అమ్మవారు బహుళ రూపిణిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



కటక్ చండీమాత గాయత్రీ అలంకరణ



బరంపురం: హనుమాన్ బజార్‌లో పూజలందుకుంటున్న దుర్గాదేవి




భువనేశ్వర్: జాజ్‌పూర్ వైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నపూర్ణగా పూజలందుకుంటున్న అమ్మవారు



పర్లాకిమిడి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం




పర్లాకిమిడి: అంకావీధిలో...



బరంపురం: గిరి మార్కెట్‌లో...



బరంపురం: పాత బస్టాండ్‌లో...



బరంపురం: భేజీపూర్ మార్కెట్‌లో...



బరంపురం: కోర్టుపేటలో...



పర్లాకిమిడి: జంగంవీధిలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సవాలకు పటిష్ట భద్రత



మాట్లాడుతున్న జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి

- భువనేశ్వర్‌లో 31 ప్లాటూన్లు
- కటక్‌లో 55 ప్లాటూన్ల పోలీసులు మోహరింపు

భువనేశ్వర్: దసరా పూజలు సందర్భంగా కమిషనరేట్ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో పూజా పందిళ్లు, మండపాలు, వేదికలు తదితర పరిసరాల్లో శాంతి భద్రతలకు ప్రాధాన్యత కల్పించారు. మహాషష్టి పురస్కరించుకుని శుక్రవారం నుంచి ఈ ప్రాంతాల్లో దేవీ పూజలు అట్టహాసంగా ఆరంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ నగరంలో 31 ప్లాటూన్ పోలీసు బలగాలను భద్రతా విధులకు నియమించారు. రాజధానిలో 188 చోట్ల దుర్గాపూజ మండపాలు ఏర్పాటు అవుతున్నాయి. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు రాజధాని నగరంలో పోలీసు భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా కొనసాగుతాయి. దీంతో భారీ వాహనాల రవాణాకు ప్రత్యేక ఆంక్షలు జారీ చేశారు. 3 వర్గాలుగా పూజా మండపాలను విభజించి ప్రత్యేక పోలీసు భద్రత కల్పిస్తామని కటక్, భువనేశ్వర్ జంట నగరాల పోలీసు కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలతో కమిషనరేట్ పోలీసుల సంయుక్త పర్యవేక్షణ పూర్తి చేశారు. కమిషనరేట్ పోలీస్ 6 చోట్ల కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. మామూళ్లు, బలవంతపు చందాల వసూళ్లు, వేధింపులు ఎదురైతే తక్షణ చర్యలు కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను జారీ చేసినట్లు తెలిపారు. భద్రతా వ్యవస్థను డీసీపీ భువనేశ్వర్ రాత్రింబవళ్ల పర్యవేక్షిస్తారని కమిషనర్ సౌమేంద్ర ప్రియదర్శి తెలిపారు. కమిషనర్ నుంచి అందిన సమాచారం మేరకు నగరంలో 12 మంది అదనపు డీసీపీలు, 23 మంది ఏసీపీలు, 41 మంది ఇన్‌స్పెక్టర్లను నియమించారు. అదేవిధంగా 151 మంది ఏఎస్‌ఐలు, 119 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లు, 70 మంది ఏపీఆర్ కానిస్టేబుళ్లు, 207 మంది ఓపీఎఫ్ కానిస్టేబుళ్లను రంగంలోకి దింపుతున్నారు. నగరంలోని వీధులు, సందులను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తారు. అదేవిధంగా పూజను చూసేందుకు వెళ్లినప్పుడు ఇంటి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

కటక్‌లో...

శుక్రవారం నుంచి కటక్ మహానగరంలో దుర్గాదేవి పూజలు ప్రారంభమవుతాయి. పూజా, నిమజ్జనం శాంతియుతంగా ముగించేందుకు కటక్‌లో కమిషనరేట్ పోలీసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది పూజా, నిమజ్జనం కోసం 55 ప్లాటూన్ల పోలీసు బలగాలతో 8 మంది అదనపు డీసీపీలు, 34 మంది డీఎస్పీలు, 54 మంది ఇన్‌స్పెక్టర్లు, 350 మంది ఏఎస్‌ఐలు, సబ్ ఇన్‌స్పెక్టర్లని నియమించారు. దేవీ పూజల కోసం నగరాన్ని 6 జోన్లుగా విభజించి శాంతి భద్రతల వ్యవస్థ వ్యూహాత్మకంగా రూపొందించారు. నగరంలో 34 పోలీసు ఎయిడ్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. నగరంలో మొత్తం 600 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో పోలీసులు భద్రత, రద్దీని పర్యవేక్షిస్తారని పోలీసు కమిషనర్ తెలిపారు. శబ్ద కాలుష్యం నివారణ నిమజ్జనం సమయంలో ఊరేగింపు సందర్భంగా శబ్ద కాలుష్యం నివారణపై పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

ఈ నేపథ్యంలో బాజా బజంత్రీలు, గానా బజానా (డీజే) గరిష్ట శబ్దస్థాయి 60 డెసిబుల్స్‌కు పరిమితం చేశారు. శుక్రవారం అమ్మవారి షష్టి పూజ జరుగుతుంది. ఈ సందర్భంగా సాయంత్రం 4 గంటల నుంచి నగరంలో వన్‌వే ట్రాఫిక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీసు వర్గాలు

టోల్ ప్లాజాలో కాల్పులు



కాల్పులు జరిగిన పిప్పిలి టోల్‌గేటు

- ఒకరికి గాయాలు

భువనేశ్వర్: పూరీ జిల్లా పిప్పిలి వద్దనున్న టోల్ ప్లాజాలో బుధవారం అర్ధరాత్రి తుపాకీ పేలింది. టోల్‌గేటు సిబ్బందితో జరిగిన వివాదంలో దుండగులు కాల్పులు జరపడంతో ఒక ఉద్యోగికి బుల్లెట్ గాయాలయ్యాయి. భువనేశ్వర్ నుంచి పూరీకి కారులో వెళ్తున్న 7 మంది వ్యక్తులు పిప్పిలి వద్ద టోల్ ప్లాజా సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వారిలో ఇద్దరు వ్యక్తులు ఉద్యోగులపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయారు. టోల్ ప్లాజాలోని ఒక ఉద్యోగికి బుల్లెట్ గాయాలయ్యాయి. అతనిని తోటి సిబ్బంది మరియు స్థానిక గ్రామస్తులు సమీపంలోని వైద్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పూరీ పరిసర ప్రాంతాల్లోని నిమ్మాపడా, పిప్పిలి, గోప్ మరియు బొలొంగా పోలీసుస్టేషన్ల సిబ్బందితో కలిసి కాల్పులు జరిపినవారిని పట్టుకునేందుకు చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగా 5 మందిని నిమ్మాపడా అరిసంద సమీపంలోని దగ్రా సాహి గహిర్ వద్ద కారు వదిలి పారిపోతుండగా స్థానిక గ్రామస్తుల సాయంతో గురువారం పట్టుకున్నారు. మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు



కటక్‌లో ఫ్లాగ్ మార్చ్

దుర్గాదేవీ పూజోత్సవాలు పురస్కరించుకుని కటక్ మహా నగరంలో శాంతి భద్రతల వ్యవస్థ పటిష్టపరిచారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానిక రెవెన్యూ కళాశాల చౌరస్తా నుంచి పూరీఘాట్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. దుర్గాపూజ–2023 ఉత్సవాల శాంతిభద్రతల బృందం సభ్యులు ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా దుర్గాపూజ మరియు దసరా పండుగ ఆనందోత్సాహాలతో ముగించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. – భువనేశ్వర్



అంబులెన్స్‌ను ఢీకొని బస్సు బోల్తా



ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న స్థానికులు



చికిత్స సదుపాయాలు పర్యవేక్షిస్తున్న భద్రక్ జిల్లా అధికార యంత్రాంగం



బోల్తా పడిన ప్రయాణికుల బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

భువనేశ్వర్: భద్రక్ జిల్లాలో గురువారం మధ్యాహ్నం అంబులెన్స్‌ను ఢీకొని ప్రైవేటు ప్రయాణికుల బస్సు బోల్తా పడింది. ఈ విచారకర సంఘటనలో 18 మందికి పైబడి తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. భద్రక్ నుంచి ప్రయాణికులతో నిండిన బస్సు ఒగొరాపాడా వైపు వెళ్తుండగా రైమాని సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. బస్సు వేగం నియంత్రణపై డ్రైవర్ పట్టు కోల్పోవడంతో ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను స్థానిక ప్రజలు రక్షించి చికిత్స కోసం సత్వర ఏర్పాట్లు చేశారు. తొలుత స్థానిక ప్రాథమిక చికిత్స కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం భద్రక్ జిల్లా ప్రధాన ఆస్పత్రి (డీహెచ్‌హెచ్)కి తరలించారు. కొంతమంది పరిస్థితి విషమంగా ఉండడంతో కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో 102 అంబులెన్స్ డ్రైవర్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

పోలీసులకు ప్రశంసలు



ట్రాఫిక్ హెచ్‌సీ చింతకాయల వెంకటరావును అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: భద్రతా విధుల్లో ప్రతిభ కనబర్చిన పోలీసులను ఎస్పీ ఎం.దీపిక గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను అందజేశారు.

అవార్డులు అందుకున్న వారి వివరాలు

ముఖ్యమంత్రి పర్యటనలో భద్రతా విధులను సమర్థవంతంగా నిర్వహించిన టూటౌన్ సీఐ ఎస్‌హెచ్. విజయానంద్, ఎస్సై షేక్ శంకర్, రాజాం చోరీ కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన రాజాం ఎస్సై వై.రవికిరణ్, అగ్నిప్రమాదానికి గురైన ప్రైవేట్ బస్సులో నుంచి ప్రయాణికులను సకాలంలో రక్షించిన ట్రాఫిక్ ఎస్సై ఏఎం.రాజు, హెచ్‌సీ సీహెచ్.వెంకటరావు, అగ్నివీర్ బందోబస్తును సమర్థంగా నిర్వహించిన ఆర్ఎస్సై ఎ.రామకృష్ణ, వివిధ కేసులను ఛేదించడంలో పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించిన టూటౌన్ హెచ్‌సీ టీవీఆర్‌కేవీ.ప్రసాద్, కానిస్టేబుల్స్ ఎం.వాసు, ఎం.గణేష్, బొబ్బిలి కానిస్టేబుల్స్ జి.శశిభూషణరావు, పి.లక్ష్మణరావు, తెర్లాం కానిస్టేబుల్ ఎస్. ఢిల్లీశ్వరరావు, గజపతినగరం కానిస్టేబుల్స్ పి.సత్యనారాయణ, ఎస్.శ్రీహరి, ఎస్బీ కానిస్టేబుల్ జె.జయకృష్ణ, రాజాం కానిస్టేబుల్స్ ఎస్.సత్యంనాయుడు, కె.సూరప్పునాయుడు, హెచ్‌సీ కె.రాజేంద్రలు ఎస్పీ ఎం.దీపిక చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

నలుగురిపై దాడి కేసు నమోదు

పార్వతీపురంటౌన్: సచివాలయ ఉద్యోగిపై దాడిచేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జి.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చేదోడు పథకంలో పేర్లు లేవని పాలకొల్లు రాము, పాండ్రంగి సంతోష్‌కుమార్, జె.జగన్నాథం, ఉద్దవోలు ఏడుకొండల వెంకటరమణలు పార్వతీపురం పట్టణ 8వ సచివాయలంలో విధులు నిర్వహిస్తున్న గొండేల శంకరరావుపై దాడిచేశారని తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడిచేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రెండు దుకాణాలు దగ్ధం

రాజాం సిటీ: స్థానిక ఎన్‌టీఆర్ కాంప్లెక్స్‌లో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు దుకాణాలు దగ్ధమయ్యాయి. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి ఆర్పకుండా చెత్తకుప్పపై పడేయడంతో మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో సెల్ రిపేరింగ్ సెంటర్‌తోపాటు కొబ్బరి బొండాల దుకాణం కాలిబూడిదయ్యాయి. కాంప్లెక్స్‌లో మంటలు వస్తుండడాన్ని గమనించిన కానిస్టేబుల్ ఆర్.రవి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల ఆస్తినష్టం సంభవించిందని ఫైర్ ఎస్సై టీఎస్ఎస్ జనార్దనరావు తెలిపారు.


వెస్ట్‌జోన్ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంఆర్ కాలేజీ విద్యార్థిని



కల్యాణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు

విజయనగరం అర్బన్: విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకు జరిగే వెస్ట్ జోన్ ఎన్ఎస్ఎస్ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి విజయనగరం పట్టణానికి చెందిన మహారాజా అటానమస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ కల్యాణి ఎంపికైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఆంధ్రయూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి రిపబ్లిక్ డే పరేడ్ ఎంపిక ప్రక్రియలో అన్ని విభాగాల్లో మెరిట్ సాధించిన ఐదుగురిలో కల్యాణి ఒకరని పేర్కొన్నారు. ఈ మేరకు ఆంధ్రయూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ నుంచి ఎంపిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు దుస్తులు, బూట్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా పీఓ జి.చంద్రశేఖరరావు, ఎన్ఎస్ఎస్ కళాశాల పీఓలు ఎం.శ్రీకాంత్, సీహెచ్.చిన్నంనాయుడు, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ ఎ.కల్యాణ్ అశోక్, కన్వీనర్ ఎస్.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కోటి కుంకుమార్చన



అమ్మవారికి కోటి కుంకుమార్చన చేస్తున్న మహిళలు

విజయనగరం: విజయనగరంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శాంతినగర్, అరుంధతి కాలనీలో పైడిమాంబ సేవా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని గురువారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి కోటికుంకుమార్చన జరిపారు. ఈ బృహత్ క్రతువులో 400 మంది మహిళా భక్తులు భాగస్వాములయ్యారు. పచ్చిగుళ్ల కృష్ణమూర్తి, అయ్యప్ప, నక్కసాదు, కొట్ల గణపతి, ప్రకాష్ తదితరులు పూజాఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి జిల్లా వాసులకు..
జీవన సాఫల్య పురస్కారాలు

రాజాం/పార్వతీపురంటౌన్: వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారాల ప్రదానంలో భాగంగా 2023వ సంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ కళాకారుడు, ఓ రచయిత ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వాసుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి మండలం మందరాడ గ్రామానికి చెందిన పౌరాణిక రంగస్థల కళాకారుడు, పద్మశ్రీ యడ్ల గోపాలరావును వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు వరించింది. రంగస్థల కళాకారుల విభాగంలో గోపాలరావుకు ఈ అవార్డు దక్కింది. 6 వేలకుపైగా పౌరాణిక నాటకాలు ప్రదర్శించిన ఆయన కలియుగ నక్షత్రక బిరుదును పొందారు. కృష్ణుడిగా, రాముడిగా, నక్షత్రకుడు, నారదుడి పౌరాణిక పాత్రలు వేసే గోపాలరావుకు నక్షత్రక పాత్ర దేశంలో ఎంతో ఖ్యాతిని తెచ్చిపెట్టింది. 2020లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో యడ్లను సత్కరించగా, తాజాగా వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు రావడంతో గోపాలరావు కుటుంబసభ్యులు సంబరాలు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం



పద్మశ్రీ యడ్ల గోపాలరావు



అట్టాడ అప్పల నాయుడు

నుంచి తనకు ఈమేరకు సమాచారం వచ్చిందని, నవంబర్ 1న ఈ అవార్డు తనకు ఇవ్వనున్నట్లు గోపాలరావు తెలిపారు. తన భార్య జయలక్ష్మితో పాటు కుటుంబసభ్యుల ప్రోత్సాహంతోనే కళారంగంలో తాను రాణించగలిగానని ఆయన అన్నారు.

సాహిత్య విభాగంలో రచయిత అట్టాడ అప్పలనాయుడు

కొమరాడ మండలం గుమడ అగ్రహారానికి చెందిన ప్రముఖ సాహితీ వేత్త అట్టాడ అప్పలనాయుడు వైఎస్సార్ లైఫ్‌టైం ఎచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 1953 ఆగస్టు 23వ తేదీన జన్మించారు. బ్యాంకులో ఉద్యోగ రీత్యా శ్రీకాకుళంలో స్థిరపడ్డారు. ప్రస్తుతం రిటైర్ అయ్యారు. శ్రీకాకుళ పోరాట ఉద్యమం సమయంలో సాహిత్యంలో ప్రవేశించిన అప్పలనాయుడు పోడు–పోరు కథా సంపుటి సహా ఇప్పటివరకు 100కు పైగా కథలు రాశారు. ఐదు కవితా సంపుటాలు ప్రచురించారు. నాటికలు, నాటకాలు రాయడం ఆయనకు అలవాటు. ఆయన రచించిన 'వారి మడిసెక్క' నాటకం జాతీయ స్థాయి ఆకాశవాణి పోటీల్లో ప్రథమ బహుమతి, నంది నాటక పోటీల్లో ఉత్తమ నాటకంగా పురస్కారం అందుకుంది. కళారత్న వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులు ఆయన పొందారు. కథానిలయం బోర్డు సభ్యుడిగా, ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. 2023 వైఎస్సార్ లైఫ్ ఎచీవ్‌మెంట్ పురస్కారానికి సాహిత్య విభాగంలో ఆయన ఎంపిక కావడంతో పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లా ర చయితలు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

పోక్సో కేసుల్లో నిందితులకు శిక్ష పడాలి

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక



సమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తు చేయాలని, సాంకేతిక ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఆమె నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పోక్సో కేసుల్లో దర్యాప్తు క్షుణ్ణంగా చేయాలని, అవసరమైన కేసుల్లో బాధితులకు కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. వివిధ పోలీసు స్టేషన్‌లలో రౌడీషీటర్లపై నమోదైన కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆయా కేసులను ప్రాధాన్యతా కేసుల జాబితాలో చేర్చి, నిందితులుగా ఉన్న రౌడీషీటర్లకు న్యాయస్థానాల్లో శిక్షలు పడే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ చేపట్టాలని, మోటార్‌వెహికల్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ చలానాలను విధించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాతే వారిపైనా, మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపైనా చర్యలు చేపట్టాలని సూచించారు. వైట్ కాలర్ నేరాలైన చీటింగ్, నమ్మక ద్రోహం కేసుల్లో దర్యాప్తు క్షుణ్ణంగా చేపట్టాలని, మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి

దొంగతనాలు జరగకుండా రాత్రి పెట్రోలింగ్, గస్తీని ముమ్మరం చేయాలని, ఏటీఎం కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

డీసీసీబీలో విజయోత్సవాలు



డీసీసీబీ చైర్మన్‌కి మీఠాయి తినిపిస్తున్న బ్యాంక్ సీఈఓ, అధికారులు

- రూ.2 వేల కోట్లు దాటిన టర్నోవర్
- 10 బ్రాంచిలలో ఈ–స్టాంపింగ్ సేవలు

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) వ్యాపార లావాదేవీల టర్నోవర్ రూ.2 వేల కోట్ల మైలురాయి దాటిన సందర్భంగా గురువారం స్థానిక బ్యాంక్ కార్యాలయంలో విజయోత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తొలుత డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడికి సీఈఓ కె.జనార్దన, బ్యాంక్ అధికారుల బృందం, సిబ్బంది మిఠాయి తినిపించారు. అనంతరం ఆయన బ్యాంక్ సీఈఓ, తదితర అధికారులను అభినందించారు. అనంతరం జిల్లాలోని 24 బ్రాంచిలలో తొలివిడతగా 10 బ్రాంచిలలో ఈ–స్టాంపింగ్ సేవలను ప్రారంభించిన తరువాత చైర్మన్ వెంకట చినరామునాయుడు మాట్లాడుతూ రైతులకు రుణాలు అందించడంలోనూ రికవరీలోనూ సిబ్బంది క్రమశిక్షణ, లక్ష్యసాధనతో నిర్వహించిన విధుల తీరును ప్రశంసించారు.

అవసరానికి రుణాల మంజూరు

కార్యక్రమంలో సీఈఓ కె.జనార్దన్ మాట్లాడుతూ రైతుకు అవసరమైన సమయంలో వ్యక్తిగత, గృహ నిర్మాణ, గృహ తనఖా, మరమ్మతు రుణాలు, బంగారు ఆభరణాల తనఖా, స్వయం, సహాయక బృందాలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న వివిధ ప్రాయోజిత పథకాలకు రుణాలు ఇస్తున్నామని వివరించారు. లబ్ధిదారుల నుంచి రికవరీ కూడా సమయానుకూలంగా చేస్తూ బ్యాంకింగ్ సేవలలో మెరుగైన విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. 2024 మార్చి 31 నాటికి రూ.2,500 కోట్లు వ్యాపార లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎంలు, ఏజీఎంలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీ ఆక్వా పరిశ్రమ మూసివేత

పూసపాటిరేగ: మండలంలోని గైతుల చోడవరంలో గల సీపీ ఆక్వాపరిశ్రమను గురువారం తాత్కాలికంగా మూసివేశారు. ముడిసరుకు అధిక ధర కారణంగా పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయినట్లు సంబధిత వర్గాల సమాచారం. ముడిసరుకు ధర పెరిగినా, రొయ్యిల ధర మాత్రం గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో ఈ దుస్థితి తలెత్తింది. ఈనేపథ్యంలో గత రెండు నెలలుగా పరిశ్రమలో ఉత్పత్తి ఆగింది. దీనిలో భాగంగా పరిశ్రమలో ఒక విభాగంలో పనిచేసే కార్మికులను మరో విభాగంలోకి పంపించడానికి యాజమాన్యం చేసిన ప్రయత్నంతో కార్మికులు తిరుగుబాటు చేశారు. ఈ నేపథ్యంలో కార్మికులు నిరసనలు చేపట్టి ధర్నాకు దిగిన ఫలితంగా పరిశ్రమ మూతపడింది. పరిశ్రమలో ఒప్పంద ప్రాతిపదికన 450 మంది కార్మికులు పనిచేయగా, 270 మంది శాశ్వత ఉద్యోగులు ఉన్నారు. కార్మికనేతలు, యాజమాన్య ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు ఫలించలేదు. దీంతో పరిశ్రమ మూసివేత ఎన్నాళ్లు కొనసాగుతుందనే ఆందోళన కార్మికుల్లో నెలకొంది.

మందుల కంపెనీ ఎం.డికి ఏడాది జైలు శిక్ష

- రూ.20 వేల జరిమానా

విజయనగరం ఫోర్ట్: నాణ్యత లేని మందులు తయారు చేసిన కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఏడాది పాటు జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. వివరాలిలా ఉన్నాయి. రాజాం పట్టణంలోని ఉమా మెడికల్ సెంటర్‌లో 2015లో అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.కృష్ణ డెలకర్ ఫోర్టే టాబ్లెట్‌ను శాంపిల్ తీసి డ్రగ్ కంట్రోల్ ల్యాబొరేటరీ (హైదరబాద్)కి పంపించారు. అక్కడ పరీక్షలో ఆ మందు నాసిరకం దని తేలింది. దీంతో రాజాం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి పీఎస్‌వీబీ కృష్ణ సాయి తేజ నాసిరకం మందులు తయారీ చేసిన ఆస్కి ఫార్మా స్యూటికల్ కంపెనీ(చైన్నై) మేనేజింగ్ డైరెక్టర్ ఏడాది పాటు జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూర్యకుమార్ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు.

శరీర దానం పట్ల అవగాహన అవసరం

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల

విజయనగరం ఫోర్ట్: శరీరదానం, అవయవ దానం పట్ల ప్రజలకు అవగాహన అవసరమని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పద్మలీల అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం శరీరదానం, అవయవదానంపై వైద్యవిద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు వైద్య బోధనకు పార్థివ దేహాలు చాలా అవసరమని తెలిపారు. మనిషి మృతి చెందిన తర్వాత శరీర దానంతో పాటు బ్రెయిన్ డెడ్ అయినప్పుడు అవయవదానం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ విషయంలో భారత దేశం చాలా వెనుకబడి ఉందని చెప్పారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైతే దేశంలో శాంతి, సుస్థిరత నెలకొంటాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనిలా సునందిని, అనాటమీ హెచ్ఓడీ డాక్టర్ వాసంతి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుదర్శి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ.రమణ, బ్రహ్మకుమారి రామేశ్వరి, సావిత్రి బాపూలే ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని సర్పంచ్ భార్య మృతి

- సర్పంచ్‌కు గాయాలు



మృతిచెందిన సరస్వతి(ఫైల్)

దత్తిరాజేరు: విజయనగరం మండలం ముడిదాం గ్రామ సమీపంలో జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దత్తిరాజేరు మండలం కన్నాం గ్రామ సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు భార్య సరస్వతి(63)అక్కడికక్కడే మృతిచెందింది. సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. సర్పంచ్ దంపతులు గురువారం స్వగ్రామం నుంచి వైజాగ్‌కు కారులో వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మృతదేహాన్ని, సర్పంచ్‌ను సర్వజన ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ దంపతుల కుమారుడు కెనడాలోను, కుమార్తె వైజాగ్‌లో నివాసం ఉంటున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్‌పై ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మండడలంలోని రావివలస గ్రామానికి చెందిన కొప్పిశెట్టి అప్పలరాము రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో ప్రమాదం జరిగినట్లు రైల్వే హెచ్‌సీ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు



గుమ్మలక్ష్మీపురం: గాయపడిన సాగర్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎగువతాడికొండ గ్రామానికి చెందిన యువకుడు సాగర్ ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఆ యువకుడు గురువారం కిసర గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో కుక్కిడి గ్రామ సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలతో ఉన్న సాగర్‌ను చూసిన దుమ్మంగి గ్రీన్ అంబాసిడర్ పండయ్య, తదితరులు భద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు.

లారీ ఢీకొని వ్యక్తి..



రాజాం సిటీ: జనార్దనరావు మృతదేహం

రాజాం సిటీ: మండల పరిధిలోని గురవాం గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిలిస్టు మృతిచెందాడు. ఈ ప్రమాదంపై ఏఎస్సై అల్లు లక్ష్మనాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొండపల్లి మండలం బూడసింగిపేట గ్రామానికి చెందిన ముద్రగడ జనార్దనరావు (45) రేగిడి మండలం బూరాడ పీహెచ్‌సీ సమీపంలో గుడారం వేసుకుని ఆయుర్వేద మందుల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే తన ద్విచక్రవాహనంపై రాజాం వెళ్తుండగా పాలకొండ నుంచి వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొంది. దీంతో రోడ్డుపై తుళ్లిపడిన జనార్దనరావు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయిలో 'విజయ దుందుభి'

- సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా జట్లు
- ప్రథమస్థానం సాధించిన బాలికలు
- తృతీయ స్థానంలో బాలురు



సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు



తృతీయ స్థానం సాధించిన బాలుర జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి 10వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విజయనగరం జిల్లా పేరు మార్మోగింది. ఈ పోటీల్లో జిల్లా బాలికలు, బాలుర జట్లు సత్తా చాటాయి. ఈ నెల 16 నుంచి 18వరకు మూడు రోజులపాటు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు జరగ్గా జిల్లా బాలికల జట్టు ప్రథమస్థానం సాధించింది. అలాగే బాలుర జట్టు తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో జిల్లా బాలికలు, బాలుర జట్లు లీగ్ మ్యాచ్‌ల్లో మంచి ప్రతిభ కనబరిచి ఫైనల్ పోటీలకు చేరుకున్నాయి. ఫైనల్ పోటీల్లో జిల్లా బాలకల జట్టు ప్రథమస్థానం సాధించగా, ద్వితీయ స్థానాన్ని అనంతపురం జిల్లా, తృతీయ స్థానాన్ని వైఎస్సార్ కడప జిల్లా జట్టు దక్కించుకున్నాయి. బాలుర విభాగంలో జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానాన్ని సాధించగా, గుంటూరు జట్టు ప్రథమ స్థానాన్ని, కర్నూలు జిల్లా జట్టు ద్వితీయ స్థానం చేజిక్కించుకున్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరు కనబరిచి పతకాలు, షీల్డ్ సాధించిన జిల్లా జట్ల క్రీడాకారులను సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లాలోని పలు ఉన్నత పాఠశాలల పీడీలు అభినందించారు.

22న మెగా రక్తదాన శిబిరం



వాక్ ఫర్ విజయనగరం ర్యాలీ టీ షర్టులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

- అదేరోజు వాక్ ఫర్ విజయనగరం ర్యాలీ
- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి. ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: సిరుల తల్లి పైడితల్లమ్మవారి జాతర మహోత్సవం సందర్భంగా ఈనెల 22న విజయనగరం జిల్లా కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు. నగరంలోని అన్ని స్వచ్ఛంద సంస్థలు, బ్లడ్ బ్యాంక్‌ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం నగరంలోని రింగ్‌రోడ్‌లో గల సుజాత కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెగా రక్తదాన శిబిరానికి ముందుగా ఉదయం స్థానిక రాజీవ్ క్రీడామైదానం నుంచి నిర్వహించే వాక్ ఫర్ విజయనగరం ర్యాలీలో పాల్గొనే వారి కోసం రూపొందించిన టీ షర్టులను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పైడితలమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛంద సంస్థలు, రక్తదాన శిబిరాల నిర్వహకులు ఆధ్వర్యంలో 22వ తేదీన స్థానిక చాసో స్మారక భవనంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని, రక్తాన్ని దానమిచ్చి ప్రాణదాతలుగా మారాలని కోరారు. సమావేశంలో కార్యక్రమ నిర్వాహకులు పద్మనాభం, ప్రవీణ్ అంచాలయా, తిరుపతిరావు పాల్గొన్నారు.

880 లీటర్ల సారా, కారు సీజ్

- ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారా రవాణాను అరికట్టేందుకు పార్వతీపురం మండలంలోని రంగాలగూడ గ్రామ సమీపంలో ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర ఆధ్వర్యంలో గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 880 లీటర్ల సారాతో ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ ఉపేంద్ర మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని అలమండ నుంచి పార్వతీపురం మైదాన ప్రాంతానికి సారా రవాణా అవుతోందన్న ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించామని తెలిపారు. కొమరాడ మండలం పూడేసు గ్రామానికి చెందిన ఆరిక నరేష్, పార్వతీపురం పట్టణానికి చెందిన సిరిపురపు నారాయణ ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా సారా రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వారికి సారా సరఫరా చేసిన ఒడిశా రాష్ట్రంలోని అలమండకు చెందిన బెవర శరత్‌పై కూడా కేసు నమోదు చేశామని, నరేష్, నారాయణలను రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. దాడుల్లో ఎస్సై వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



గంట్యాడ: మద్యం తరలిస్తూ పట్టుబడిన వ్యక్తులు

100 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

గంట్యాడ: మండలంలోని బుడతనాపల్లి గ్రామం వైపు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొఠారుబిల్లి జంక్షన్ సమీపంలో పోలీసులు ఇద్దరు వ్యక్తులను మద్యం సీసాలతో పట్టుకున్నారు. మండలంలోని లక్కిడాం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ, బాడంగి మండలానికి చెందిన తోట దుర్గారావు కొఠారుబిల్లి జంక్షన్ నుంచి బైక్‌పై అక్రమంగా 100 మద్యం సీసాలు తరలిస్తుండగా గోకులం లేవుట్ సమీపంలో బంగారమ్మ గుడి దగ్గర పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు హెచ్‌సీ జె. శ్రీనివాసరావు తెలిపారు.

రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని మోసం

విజయనగరం క్రైమ్: రైల్వేశాఖలో ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి కుటుంబ సభ్యుల వద్ద లక్షల రూపాయలు మింగేసిన వారిపై ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉ న్నాయి. కంటోన్మెంట్ ప్రాంతానికి చెందిన వాకాడ పూజకు వరసకు పెద్దమ్మ, అయిన జోగి సూర్యకాంతం, ఆమె కుమారుడు హరికృష్ణ రై ల్వేలో ఉద్యోగం చే స్తున్నారు. రైల్వేలో ఉద్యోగాలిప్పిస్తామని పూజ, వారి కుటుంబ సభ్యులను నమ్మబలికి తల్లీకొడుకులు దపదఫాలుగా వారి నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఉద్యోగం లేకపోగా, డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితురాలు పూజ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాదర్‌బాబాకు పుష్పాభిషేకం



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఖాదర్‌బాబా దర్బార్ నిర్వాహకులు

విజయనగరం బాబామెట్టలో కొలువైన హజతర్ సయ్యద్ ఖాదర్ వలీ బాబా 127వ జయంతిని గురువారం దర్బార్ షరీఫ్ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. దర్బార్ నుంచి పకీర్ ఖవ్వాలి, మేళతాళాలు మధ్య ఊరేగింపుగా ఖాదర్ బాబా దర్గాకి వెళ్లి, బాబాకి చాదర్, సుగంధ తైలాలు సమర్పించి పుష్పాభిషేకం చేశారు. అనంతరం విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో చీమలపాడు దర్గా దర్బార్ షరీఫ్ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మొహియినుద్దీన్ తాజ్ ఖాదరీ, ఖాదర్ బాబాదర్గా దర్బార్ ముతవల్లి డాక్టర్ ఎమ్.డి.ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ (ఖలీల్‌బాబు) పాల్గొన్నారు.

– విజయనగరం టౌన్